# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 15 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4





## వెస్టిండీస్‌పై సిరీస్ క్లీన్ స్వీప్

- రెండో టెస్టులో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం
- అర్ధ సెంచరీతో రాణించిన రాహుల్

వివరాలు 4వ పేజీలో

# రాజస్థాన్‌లో బస్సు దగ్ధం



## 20 మంది సజీవ దహనం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాజస్థాన్‌లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సులో మంటలు చెలరేగి, 20 మంది సజీవదహనమయ్యారు. మరికొంతమంది తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో జైసల్మేర్ నుంచి బయలుదేరిన ప్రైవేట్ బస్సు, సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న థాయత్ గ్రామం సమీపంలో వెనుక భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే అగ్ని జ్వాలలు బస్సంతా వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. వారి కేకలు విని స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు.

సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ బృందాలు అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశాయి. ఈ ప్రమాదంలో 20 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిని సమీపంలోని జవహర్ ఆస్పత్రికి తరలించారు. బస్సులో మొత్తం 57 మంది ప్రయాణికులు ఉన్నారని అధికారులు వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, ముగ్గురు పిల్లలు ఉన్నారని జైసల్మేర్ మున్సిపల్ కౌన్సిల్ అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కృష్ణపాల్ సింగ్ రథోర్ తెలిపారు. ప్రమాద సమయంలో కొందరు ప్రయాణికులు కిటికీలు పగులగొట్టి బయటపడగలిగారు.

ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు ఇంజిన్‌లో లేదా వైరింగ్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. మృతుల కుటుంబాలకు రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ సంతాపం ప్రకటించి, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూళ్లపై నివేదిక పంపండి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



బెస్ట్ అవైలబుల్ స్కూళ్లపై వెంటనే నివేదిక పంపాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బకాయిల పేరిట బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల కు విద్యార్థులను అనుమతించక పోవడంపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. "బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులకు సంబంధించిన ఒప్పందం పాఠశాల యాజమాన్యాలు, జిల్లా యంత్రాంగం మధ్య జరిగింది. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే పాఠశాల యాజమాన్యాలు జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలే తప్ప విద్యార్థులను బయటికి పంపడానికి వీలులేదు. జిల్లా కలెక్టర్లు, డీఈవోలు, సంక్షేమ శాఖ అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని ఈ స్కీం కింద ఎంపికైన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండేలా వెంటనే చర్యలు చేపట్టండి" అని భట్టి ఆదేశించారు. విద్యా హక్కు చట్టం, బెస్ట్ అవైలబుల్ స్కీం ఏం చెబుతుందో పాఠశాలల యాజమాన్యాలను పిలిచి వివరించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ స్కీం కింద పాఠశాలల వారీగా ఉన్న బకాయిల వివరాలను వెంటనే పంపాలని ఆదేశించారు. బకాయిల్లో కొంత మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని అన్నారు. "బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు ఎప్పటికప్పుడు రాకపోతే కొన్ని పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఉందని యాజమాన్యాలు అంటున్నాయి. ఈ స్కీం నిధులపై ఆధారపడితే అది ప్రముఖ పాఠశాల ఏ విధంగా అవుతుంది. డీఈవోలు వెంటనే అన్ని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లను సందర్శించాలి. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత? ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయి? తదితర వివరాలతో వెంటనే నివేదిక సమర్పించండి" అని భట్టి ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్, కమిషనర్ క్షితిజ తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోండి

- కేంద్రానికి తెలంగాణ లేఖ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పోలవరం- బనకచర్ల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకెళ్లకుండా నిలువరించాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ సర్కారు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్టు లేఖలో గుర్తు చేశారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే, నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింకు ప్రాజెక్టు చేపట్టకుండా అడ్డుకోవాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు సైతం లేఖ రాసింది. తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. పోలవరం-బనకచర్ల విషయంలో ఏపీ ముందుకెళ్లకుండా నిలువరించడంతో పాటు టెండర్, భూసేకరణ విషయంలోనూ ముందుకెళ్లకుండా చూడాలని కోరారు.

# తెలంగాణ రైజింగ్ 2047 పౌర సర్వేలో ఉద్యోగులు పాల్గొనాలి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రైజింగ్ విజన్ -2047 పౌర సర్వేలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ విధిగా పాల్గొనాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంటును రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న విజన్ తయారీలో పౌరులందరూ భాగస్వామ్యం పొందేలా సిటిజన్ సర్వే చేపట్టామని తెలిపారు. అక్టోబర్ 10న ప్రారంభమైన సర్వేలో రాష్ట్ర ప్రజలు, ఎన్‌ఆర్‌ఐలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేలో ప్రతీ ఉద్యోగి పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఈనెల 25 వరకు జరిగే సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనడంతోపాటు సర్వే లింక్ కోడ్‌ను తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సర్క్యులర్‌లో ఆదేశించారు.

## తమిళనాడు మద్యం కుంభకోణంపై
# ఈడీ దర్యాప్తు ఎక్కడిదాకా వచ్చింది...?

- సుప్రీంకోర్టు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (టస్మాక్) మద్యం కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు ఎక్కడిదాకా వచ్చిందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మార్చిలో జరిగిన రెండు దాడులపై ఆరు నెలల వ్యవధిలో రెండోసారి కోర్టు ఈడీని నిలదీసింది. మంగళవారం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ ఈడీ అధికారులను ప్రశ్నిస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి దర్యాప్తు చేసే హక్కును మీరు తీసుకోవడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రం నేరాన్ని దర్యాప్తు చేయడం లేదా, మీరే ఆ రాష్ట్రానికి వెళ్లి దాన్ని చేయగలరా అని అన్నారు. కోర్టు వ్యాఖ్యానిస్తూ, విచారణ కొనసాగుతున్న సమయంలో ఇంతకంటే ఎక్కువ వ్యాఖ్యలు చేయడం సముచితం కాదని సీజేఐ పేర్కొన్నారు.

ఈ కేసులో తమిళనాడు ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. వారు మాట్లాడుతూ, "ఆరోపణలపై రాష్ట్ర పోలీసులు ఇప్పటికే కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ ఈడీ ప్రభుత్వరంగ సంస్థపై దాడులు చేస్తూ, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకోవడం చట్టవిరుద్ధం," అని వాదించారు. సిబల్ మాట్లాడుతూ, "ఇప్పటికే ఆరు ఎఫ్ఐఆర్‌లు



నమోదయ్యాయి. అయినా ఈడీ ఎందుకు జోక్యం చేసుకుంటోంది?" అని ప్రశ్నించారు. రోహత్గీ వ్యాఖ్యానిస్తూ, "టస్మాక్ సిబ్బంది గోప్యతా హక్కు ఎక్కడ? వారి మొబైల్ ఫోన్లను లాక్ చేయడం ఎలా సమంజసం?" అని ప్రశ్నించారు.

ఈడీ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వీ. రాజు మాట్లాడుతూ, రాష్ట్ర పోలీసులు ఇప్పటికే 47 కేసులు నమోదు చేశారని, ఈడీ మాత్రం మనీలాండరింగ్ అంశాన్ని మాత్రమే దర్యాప్తు చేస్తోందని తెలిపారు. దీనికి ప్రతిగా కపిల్ సిబల్ మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని లిలిసెక్షన్ 66(2)లిలిను ప్రస్తావించారు. దర్యాప్తు సమయంలో ఏజెన్సీకి ఇతర చట్టాల ఉల్లంఘన కనపడితే, సంబంధిత అధికారులకు సమాచారం పంచుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు.



## బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు బీ ఫామ్' అందజేసిన కేసీఆర్..

**బలగం టీవీ, హైదరాబాద్**

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి భారత్ రాష్ట్ర సమితి పార్టీ తరపున పోటీ చేయనున్న అభ్యర్థి మాగంటి సునీతకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు (కేసీఆర్) 'బి ఫామ్'ను అందజేశారు. దివంగత మాగంటి గోపీనాథ్ సతీమణి అయిన సునీతను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. మంగళవారం ఎర్రవల్లిలోని తన నివాసంలో కేసీఆర్ పలువురు పార్టీ నేతలతో సమావేశమై తాజా రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రభుత్వ వైఖరిపై చర్చించారు. ఈ సందర్భంగానే మాగంటి సునీతకు అధికారికంగా పార్టీ 'బి ఫామ్'ను అందజేసి, ఆమెకు అభినందనలు తెలిపారు.




# 25న మెగా జాబ్‌మేళా

**బలగం టీవీ, హైదరాబాద్**

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ నెల 25న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 150 కంపెనీలలో 10 వేల మందికి ఉపాధి కల్పించేందుకు గాను ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు మెగా జాబ్ మేళా గోడపత్రికను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళ వారం రాష్ట్ర సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణా డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి అవకాశాల కోసం తెలంగాణా డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ అధికారులు రూపొందించిన మరో గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మట్లాడుతూ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించనున్న ఈ మెగా జాబ్ మేళాకు సుమారు పది వేలమంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 150 కంపెనీలు ఇందులో పాల్గొనబోతున్నాయని చెప్పారు. ఇందులో ఐటీ మ్యాన్యుఫ్యాక్షరింగ్, సర్వీసెస్, ట్రేడింగ్, ఫార్మా, బ్యాంకింగ్, తదితర పరిశ్రమలు ఉంటాయన్నారు. నిరుద్యోగులకు వెసులుబాటుగా ఉండేందుకు గాను మెగా జాబ్ మేళా జరుగుతున్న చోట హెల్ప్‌డెస్క్‌తో పాటు ఆన్‌లైన్ సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మెగా జాబ్ మేళాకు హాజరవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు మౌలిక సదుపాయాలతో పాటు ఇంటర్నెట్ తదితర ఏర్పాట్లు ఉండేలా చూడాలని ఆయన డీఈఈటీ అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట కంప్యూటర్లు, ప్రింటర్లు, జీరాక్స్ మిషన్లు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. మెగా జాబ్ మేళాలో అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనేలా ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ తదితర కళాశాలలకు సమాచారం అందిం చాలన్నారు. ప్రత్యక్ష నియామకాలకు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అధికారులు మరోసారి సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాను అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు.

# జూబ్లీహిల్స్‌లో దొంగ ఓటర్ల జాబితా




- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భారీ ఎత్తున దొంగ ఓట్లు నమోదు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కే విధంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో వ్యవహరిస్తోందని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ'ఎన్ని కుట్రలు చేసినా, కుతంత్రాలు పన్నినా జూబ్లీహిల్స్‌లో గెలవేది మాత్రం భారత రాష్ట్ర సమితినే" అని స్పష్టం చేశారు. ఉప ఎన్నికల నేపథ్యంలో ఈ నియోజకవర్గంలో 23 వేల కొత్త ఓట్లు పెరగడం, మరోవైపు 12 వేల ఓట్లు డిలీట్ కావడం అనేక అనుమానాలకు తావిస్తున్నదని ఆయన అన్నారు.

ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న వ్యక్తి ఎన్నికల కమిషన్ అధికారుల్లా ప్రవర్తించి, అక్రమంగా ఓటర్ ఐడీలను పంచినట్లు కేటీఆర్ ఆరోపించారు. మైనర్ బాలబాలికలకూ ఓటర్ కార్డులు ఇచ్చారని, ఓటర్ జాబితా పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఫోటోలు వాడటం ప్రజాస్వామ్యానికి అవమానం అని విమర్శించారు. ఫేక్ ఓటర్ ఐడీల పంపిణీపై ఎన్నికల సంఘం ఇప్పటికే కేసు నమోదు చేసిందని కేటీఆర్ తెలిపారు. పార్టీ శ్రేణులు సేకరించిన ఆధారాలను ఆయన మీడియా ముందు ప్రదర్శించారు. "సాంస్కృతి అపార్ట్‌మెంట్స్‌లో 43 ఓట్లు ఉన్నాయని రికార్డులో ఉంది, కానీ ఆ యజమానులు 'మాకు సంబంధం లేదు' అని చెబుతున్నారు. 80 గజాల ఇంట్లో 23 ఓట్లు ఎలా నమోదు అయ్యాయి?" అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇళ్లలో కూడా దొంగ ఓట్లు నమోదైనట్టు ఆధారాలు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో ఓటు నమోదైన ఒకరు సిరిసిల్ల నివాసి శ్రీనివాస్ రెడ్డి అని, ఆయనతో

మిగితా 2వ పేజీలో

# బంగారం పైపైకి...

- 10 గ్రాములు రూ.1.30 లక్షలు

**బలగం టీవీ, హైదరాబాద్**

బంగారం, వెండి ధరలు రోజు రోజుకు సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. పసిడి ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా రూ.1.30 లక్షలకు ఎగిసి భగ్గుమంటోంది. ఆల్ ఇండియా షరాఫ్ అసోసియేషన్ ప్రకారం.. మంగళ వారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,850 పెరిగి అన్ని పన్నులు కలుపుకుని రూ.1,30,800కు చేరింది. ఇంతక్రితం సెషన్‌లో రూ.1,27,950 వద్ద ముగిసింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి రూ.2,850 ప్రియమై రూ.1,30,200గా పలికింది. కిలో వెండిపై ఏకంగా రూ.6,000 ఎగిసి రూ.1,85,000కు చేరింది. ఇది వరుసగా ఐదో రోజూ పెరుగుదల.




అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ బంగారం 0.72 శాతం పెరిగి ఒక్క ఔన్స్ ధర రూ. 4,140.34కు చేరి.. ఆల్‌టైం గరిష్ట స్థాయిని నమోదు చేసింది. ఒక్క ఔన్స్ స్పాట్ వెండి 1.92 శాతం ప్రియమై 53.54 డాలర్లుగా చోటు చేసుకుంది.

## లంచం అడిగారని యువ రైతు ఆత్మహత్యాయత్నం

- రైతును అడ్డుకుని కాపాడిన పోలీసులు
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఘటన

వివరాలు 2వ పేజీలో

# రూపాయి చారిత్రాత్మక పతనం



**బలగం టీవీ, హైదరాబాద్**

అంతర్జాతీయ ద్రవ్య మార్కె ట్‌లో రూపాయి విలువ ఆల్‌టైం కనిష్ట స్థాయికి పడి పోయింది. రూపాయి చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో ఇంట్రాడేలో 88.81కు పతనమయ్యింది. భారత్ పై అమెరికా వేసిన భారీ టారి ఫ్‌లతో దేశీయ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం నెలకొనడంతో రూపా యిపై ఒత్తిడి నెలకొందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు డాలర్ల కొనుగోళ్లకు దిగుమతి దారులు మొగ్గు చూపడం, రూపాయి పతనాన్ని కట్టడి చేయడంలో మోడీ సర్కార్ విఫలం కావడం, స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి, ఎఫ్ఐఐలు తరలిపోవడం తదితర పరిణా మాలు దేశీయ కరెన్సీని రికార్డ్ కనిష్టానికి నెట్టాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 12 పైసలు పతనమై 88.80కి దిగజారింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 88.73 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 88.81 అత్యల్ప స్థాయికి పడిపోయింది. ఇంత క్రితం సెప్టెంబర్ 30న 88.80 కనిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత ఈ స్థాయిలో పడిపో వడం ఇదే తొలిసారి. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమ తులను భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం పెరిగిపోనుంది.

# భారత జీడీపీ వృద్ధి అంచనాను 6.6 శాతానికి పెంచిన ఐఎంఎఫ్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

అంతర్జాతీయ వాణిజ్య రంగంలో నెలకొన్న సవాళ్లను ఎదుర్కొంటూ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) భారత్‌కు శుభవార్త చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను భారత జీడీపీ వృద్ధి అంచనాను 6.4 శాతం నుంచి 6.6 శాతానికి పెంచుతున్నట్లు మంగళవారం విడుదల చేసిన 'వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్' నివేదికలో వెల్లడించింది.ఐఎంఎఫ్ ప్రకారం, భారత ఎగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించినప్పటికీ, దేశీయంగా బలమైన ఆర్థిక కార్యకలాపాలు, వినియోగం, పెట్టుబడులు స్థిరంగా ఉండటంతో వృద్ధి అంచనాను సవరించినట్లు తెలిపింది.

2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని, ఇది గత ఏడాది కాలంలో అత్యధికమని ఐఎంఎఫ్ పేర్కొంది. ముఖ్యంగా ప్రైవేట్ వినియోగం, జీఎస్టీ సంస్కరణలతో పన్ను భారాన్ని తగ్గించడం వలన దేశీయ డిమాండ్ పెరిగిందని విశ్లేషించింది. ఈ పరిణామం అమెరికా సుంకాల ప్రభావాన్ని సమతుల్యం చేయగలదని నివేదికలో పేర్కొంది. ఇటీవల ప్రపంచ బ్యాంకు కూడా భారత వృద్ధి అంచనాను 6.3 శాతం నుంచి 6.5 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఐఎంఎఫ్ కూడా అదే దిశగా అడుగులు వేయడం భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు నిదర్శనమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జియేవా మాట్లాడుతూ, "మారుతున్న ప్రపంచ ఆర్థిక క్రమంలో చైనా వృద్ధి నెమ్మదిస్తున్న వేళ, భారత్ ప్రపంచానికి కొత్త వృద్ధి ఇంజిన్‌గా నిలుస్తోంది" అని ప్రశంసించారు. అయితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇంకా పూర్తిగా గడ్డు పరిస్థితుల నుంచి బయటపడలేదని, రాబోయే రోజుల్లో వర్ధమాన దేశాలకు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు.

# సీజనల్ వ్యాధులు పూర్తిగా తగ్గుముఖం

- గతేడాది కంటే తక్కువగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు
- సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

%రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖాన్ల పనితీరు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సెక్రటేరియట్‌లో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత రెండేండ్లతో పోల్చితే, ఈ ఏడాది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర కేసులు గణనీయంగా తగ్గాయని హెల్త్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవీంద్ర నాయక్ మంత్రికి వివరించారు.

గతేడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకూ చికున్‌గున్యా కేసులు 361 నమోద వగా, ఈ ఏడాది జనవర్ నుంచి సెప్టెంబర్ వరకూ 249 కేసులు మాత్రమే నమోద య్యాయని వెల్లడించారు. ఇదే సమయంలో గతేడాది 226 మలేరియా కేసులు నమోద వగా, ఈ ఏడాది 209 కేసులు మాత్రమే వచ్చాయన్నారు. గతేడాది టైఫాయిడ్ కేసులు 10,149 నమోదవగా, ఈ ఏడాది 4600 మాత్రమే నమోదయ్యాయని అధికారులు వివరించారు.గతేడాదితో పోలిస్తే డెంగీ కేసులు 2900 తక్కువగా నమోదయ్యాయని అధికారులు తెలిపారు.ఈ మేరకు అధికారులు మంత్రికి నివేదిక అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల ప్రభావం తక్కువగా ఉండడం అభినందనీయమన్నారు.

మొత్తంగా చూసినప్పుడు కేసులు తక్కువగా ఉన్నప్పటికీ, గ్రేటర్ హైదరాబాద్, మరో నాలుగైదు జిల్లాల్లో స్వల్పంగా కేసులు పెరిగాయని, ఆయా జిల్లాల్లో యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలన్నారు. ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని, ఆయా జిల్లాల్లోని హాస్పిటళ్లలో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిని అప్రమత్తం చేయాలని మంత్రి సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వాతావరణంలో వస్తున్న మార్పులు, ఆ మార్పుల వల్ల ప్రబలే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు పడుతున్న జిల్లాల్లో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పర్యటించాలని మంత్రి ఆదేశించారు. ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకున్నట్టే, ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలను ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని మంత్రి సూచించారు. ఒకవేళ సీజనల్ వ్యాధుల బారినపడితే, ప్రభుత్వ దవాఖాన్ల వైద్య సేవలను ఉపయోగించుకోవాలని మంత్రి కోరారు. ప్రభుత్వ దవాఖాన్లలో అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

# లంచం అడిగారని యువ రైతు ఆత్మహత్యాయత్నం

- రైతును అడ్డుకుని కాపాడిన పోలీసులు
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఘటన

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



రెవెన్యూ అధికారులు లంచం అడుగుతున్నారని ఆగ్రహంతో ఓ యువ రైతు, ఎమ్మార్వో కార్యాలయం ఎదుటే ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని దుండిగల్ మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్లు 148, 150లో తన కుటుంబానికి కేటాయించిన భూదాన్ భూములకు సంబంధించి పట్టా, పాస్‌బుక్, కోసం రైతు సిద్దు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అలాగే తన భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్నాడు. అయితే పనిని పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు రూ.6 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో మనస్తాపానికి గురైన రైతు కోర్టు తనకు అనుకూలంగా ఇచ్చిన ఆర్డర్ కాపీతో పాటు, చేతిలో ఒక లేఖ పట్టుకుని మంగళవారం ఎమ్మార్వో కార్యాలయం ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. "రెవెన్యూ అధికారుల అవినీతి తీరుతోనే నేను ఆత్మహత్యకు పాల్పడుతున్నాను" అని ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే, అక్కడే ఉన్న పోలీసులు, స్థానికులు అప్రమత్తమై అతన్ని అడ్డుకుని రక్షించారు. అనంతరం రైతును ఎమ్మార్వో ఎదుటకు తీసుకెళ్లారు. బాధితుడికి ఎంఆర్ఓ ఎండీ మతిన్ నచ్చజెప్పి భూమి పత్రాలను స్వీకరించి రేపటిలోగా నీ పని పూర్తి చేస్తానని హామి ఇచ్చారు. ఇదిలా ఉండగా గిరిజన సమాజానికి చెందిన సిద్దును అధికారులు కులం పేరుతో అవమానించారని, "మీ జాతి వాళ్లు ఆఫీసులోకి రాకూడదు" అని తిడుతూ ప్రవర్తించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ అవమానం, లంచం డిమాండ్లతో విసిగిపోయిన సిద్దు చివరికి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు.

# జూబ్లీహిల్స్‌లో దొంగ ఓటర్ల జాబితా

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడినప్పుడు "నాకు సంబంధం లేకుండానే నా పేరిట ఓటు నమోదు చేశారు" అని చెప్పారని వెల్లడించారు. ఇంతకంటే దారుణంగా, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ తమ్ముడు వెంకట్ ప్రవీణ్ యాదవ్ పేరుతో మూడు ఓట్లు ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. "ఇలాంటి దారుణ పరిస్థితుల్లో ఎన్నికల విశ్వసనీయతే ప్రశ్నార్థకమవుతోంది," అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. "కొత్తగా వచ్చిన 23 వేల ఓట్లపై దర్యాప్తు జరగాలి, డూప్లికేట్ ఓట్లు వెంటనే తొలగించాలి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి," అని మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. "24 గంటలు దాటినా ఎన్నికల సంఘం నుంచి స్పందన రాకపోవడంతో రేపు హైకోర్టును ఆశ్రయిస్తాం," అని హెచ్చరించారు. "తెలంగాణలో జరిగిన ఈ ఓటు చోరీపై రాహుల్ గాంధీ స్పందించాలి. బీహార్‌లో రాజ్యాంగం గురించి నీతి సూక్తులు చెప్పే రాహుల్, తెలంగాణలో తమ పార్టీ దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కింది స్థాయి అధికారులతో కుమ్మక్కై, ఎన్నికల అక్రమాలకు పాల్పడుతోందని, ప్రజాస్వామ్య విలువలను తాకట్టు పెడుతోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఇరిగేషన్ ఇంజినీర్లపై బదిలీ వేటు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నీటిపారుదల శాఖలో ఇంజినీర్లను భారీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు మంగళవారం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌వోసీల జారీ విషయంలో ఇంజినీర్లపై వచ్చిన ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. బదిలీ అయిన 106 మంది ఇంజినీర్లల్లో ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు ఉన్నారు. గతంలో వచ్చిన ఆరోపణలతోపాటు క్షేత్రస్థాయిలో ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు రావడంతో సమూల ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయి ఇంజినీర్లను బదిలీ చేసింది. హైదరాబాద్ సర్కిల్ పరిధిలోనే 60 మందికిపైగా ఇంజినీర్లపై బదిలీ వేటు వేయడం గమనార్హం.

## ఇద్దరు కవల పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది. పిల్లల ఆరోగ్యం విషయంలో భర్తతో గొడవ కారణంగా ఓ మహిళ తన ఇద్దరు కవల పిల్లలను చంపేసి.. ఆపై ఆమె కూడా ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించి సీఐ నరసింహారాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన సాయిలక్ష్మి(27), అనిల్ కుమార్ దంపతులు బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్ 1లో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కవల పిల్లలు కార్తికేయ(2), లాస్య వల్లి(2) ఉన్నారు. కార్తికేయకు రెండేండ్లు వచ్చినా మాటలు రాకపోవడంతో కొద్దిరోజులుగా దంపతుల మధ్య గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో సాయి లక్ష్మి మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కవల పిల్లలిద్దరినీ గొంతు నులిమి చంపింది. అనంతరం ఆమె ఇంటి మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత మల్లోజుల..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



మావోయిస్టు పార్టీకి అత్యంత భారీ ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు కేంద్ర కమిటీలో కీలక అగ్రనేతగా ఉన్న మల్లోజుల వేణుగోపాల రావు అలియాస్ సోను పోలీసుల ముందు లొంగిపోయారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల ఎదుట ఆయన తనతో పాటు మరో 60 మంది మావోయిస్టు సభ్యులతో కలిసి ఆయుధాలు వీడారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా మల్లోజుల వేణుగోపాల రావు మావోయిస్టు పార్టీలో సుదీర్ఘకాలం పాటు అగ్ర నాయకత్వంలో కొనసాగారు. అయితే, కొద్ది రోజులుగా పార్టీ ప్రస్తుత విధానాలపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ లేఖలు విడుదల చేయడం, ఆయుధాలు వీడాలని పిలుపునివ్వడం మావోయిస్టు పార్టీలో కలకలం రేపింది. ఈ పరిణామాల మధ్య ఆయన లొంగిపోవడం పార్టీకి కోలుకోలేని దెబ్బగా భావిస్తున్నారు. దేశంలో మార్చి 2026 నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఇప్పటికే హెచ్చరించిన నేపథ్యంలో, అగ్రనేత మల్లోజుల లొంగుబాటు ఈ లక్ష్యం దిశగా కేంద్ర ప్రభుత్వానికి లభించిన కీలక విజయంగా పరిగణించవచ్చు.

# చిక్కడపల్లి లైబ్రరీకి కవిత... ఉద్రిక్తత

**బలగం టీవీ, హైదరాబాద్**



హైదరాబాద్ చిక్కడపల్లిలోని సిటీ సెంటర్ లైబ్రరీ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రూప్ 1 పరీక్షల్లో అవకతవకలు, నిరుద్యోగ సమస్యపై చర్చించేందుకు మంగళవారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని సిటీ సెంటర్ లైబ్రరీ వద్దకు ఆమె చేరుకున్నారు. విషయం ముందే తెలుసుకున్న పోలీసులు ఆమె లైబ్రరీలోనికి ప్రవేశించకుండా గేటుకు తాళం వేయడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కవితతో అక్కడకు చేరుకున్న జాగతి నాయకులు గేటు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించారు. అనంతరం అక్కడ విద్యార్థులతో కలిసి కవిత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు విద్యార్థులకు అన్యాయం చేశాయి కాబట్టి ప్రతిపక్షంలో ఉన్నాయని తెలంగాణ జాగతి అధ్యక్షురాలు కవిత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థులకు అన్యాయం చేయాలని చూస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. విద్యార్థులతో ప్రశాంతంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవడానికి వస్తే పోలీసులు ఉద్రిక్త పరిస్థితి సష్టించారని ఆరోపించారు. లైబ్రరీ గేటులోనికి రానివ్వకుండా అడ్డుకున్నారని, లోనికి ప్రవేశించినా లైబ్రరీలోకి వెళ్లకుండా నిర్బంధించారన్నారు. కోర్టులో గ్రూప్-1 అభ్యర్థుల అవకతవకలపై విచారణ జరగనుందని, విద్యార్థులకు సింగిల్ జడ్జిమెంట్ ఏదైనా, అందుకు కట్టుబడి ఉండాలని కవిత కోరారు. తెలుగు భాషలో పరీక్ష రాసిన విద్యార్థులు దారుణమైన అన్యాయం ఎదుర్కొంటున్నారన్నారు. నష్టపోయిన వారిలో పోలీసు వారి పిల్లలు కూడా చాలామంది ఉన్నారని, మీరు ప్రభుత్వానికి వత్తాసు పలకడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మీ పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు రావడం లేదని, అటువంటి ప్రభుత్వాన్ని ఏ విధంగా రక్షిస్తారని ప్రశ్నించారు.

రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ప్రభుత్వం.. 50 వేల ఉద్యోగాలకు పాత నోటిఫికేషన్ ఇచ్చారని, కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని తెలిపారు. వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివిజన్ బెంచ్‌లో విద్యార్థులకనుగుణంగా తీర్పు రాకపోతే సుప్రీంకోర్టు వరకు విద్యార్థుల వెంటే ఉండి నడుస్తామన్నారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండా గ్రూప్ 1ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు జాగతి నాయకులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్ ఢీకొని మూడేళ్ల బాలుడు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం రహత్‌నగర్ గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. వివరాల్లోకి వెళ్తే భీమ్‌గల్ పట్టణానికి చెందిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బస్సు బడి పిల్లలను తీసుకురావడానికి రహత్‌నగర్ గ్రామానికి వెళ్లింది. ఆ సమయంలో ఒక విద్యార్థి తల్లి శిరీష తన పెద్ద కుమారుడిని స్కూల్ బస్సులో ఎక్కిస్తున్నది. ఇదే సమయంలో ఆమె చిన్న కుమారుడు శ్రీకాంత్ (3) బస్సు ముందు ఆడుకుంటూ ఉన్నాడు. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును ముందుకు నడపడంతో బాలుడు బస్సు చక్రాల కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తక్షణమే స్థానికులు బాలుణ్ణి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఏసీబీ వలలో
# రాజన్న సిరిసిల్ల అవినీతి సర్వేయర్ వేణు..

- **రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




రాజన్న సిరిసిల్ల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపుదాడి చేసి ఓ అవినీతి సర్వేయర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిరిసిల్లలో పనిచేస్తున్న సర్వేయర్ వేణు, ఓ బాధితుడి నుండి లంచం తీసుకుంటుండగా ఏసీబీ వలలో చిక్కారు. చిన్న బోనాలలో మూడు ఎకరాల భూమికి సంబంధించిన సర్వే పూర్తి చేయడానికి సర్వేయర్ వేణు, బాధితుడిని లంచం డిమాండ్ చేశాడు. మొదటగా రూ.10 వేలు తీసుకున్న వేణు, సర్వే పూర్తయిన తర్వాత మరో రూ.20 వేలు తీసుకున్నాడు సర్వేయర్ వేణు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు పక్కా వ్యూహంతో రంగంలోకి దిగారు. బాధితుడు సర్వేయర్ వేణుకు రూ.20 వేలు లంచం ఇస్తుండగా, ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వేణును అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు త్వరలో అధికారికంగా వెల్లడించనున్నారు.



# మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు..

- **ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే వరి ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వెల్లడించారు. సోమవారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్, చిక్కుడువానిపల్లి, అనంతారం,ముస్కానిపేట,గాలిపెల్లి, పొత్తూరు గ్రామాల్లో ఐకేపీ,సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ ఏడాది ధాన్యం మద్దతు ధర పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిందని, ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2,389, సాధారణ రకం రూ.2,369కు కొనుగోలు చేయాలని నిర్దేశించిన దృష్ట్యా దీని ప్రకారమే కొనుగోళ్లు చేపడుతున్నామన్నారు. వర్షాల సాకుతో దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వపరంగా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే లబ్ధిపొందాలన్నారు. ధాన్యాన్ని భద్రపరిచేందుకు వీలులేకపోవడాన్ని అదునుగా చేసుకున్న కొంత మంది దళారులు పొలాల వద్దే ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. దళారుల మోసాలకు గురికావొద్దని ఆయన రైతులను కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య–మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎనగందుల ప్రసాద్, పార్టీ నాయకులు రాజేశం, వీరేశం, రజనీకాంత్, కె.రాంప్రసాద్, వెంకటరెడ్డి, పసుల వెంకటి, అంతగిరి, తీగల పుష్పలత, జ్యోతి, సురేందర్ రెడ్డి, మామిడి రాజు, గొడుగు హరికుమార్, సంజీవ్, కె.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.




# ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రికి ప్రముఖుల నివాళులు..

**బలగం టీవీ, సిద్దిపేట**

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ తొలి ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య ఇటీవల మరణించిన సందర్భంగా సోమవారం నాడు పలువురు నాయకులు మరియు ప్రముఖులు వారి స్వగ్రామం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపురం గ్రామానికి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఎర్రోళ్ల శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మృతుని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ నివాళి కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు చిలుముల జయవర్ధన్, టీపీటీఎఫ్ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి, ప్రభుత్వ ఉపాధ్యాయులు పల్లె ఎల్లయ్య, నగునూరి పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## దోమలకుంట అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం వేడుకలు

**బలగం, దోమలకుంట**

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దోమలకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ మాసం వేడుకలు నిర్వహించారు.

# విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించాలి

- **కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**బలగం టీవీ, పెద్దపల్లి**




విద్యార్థులలో జ్ఞానంతో పాటు సృజనాత్మకతను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఉపాధ్యాయులకు "థింక్ – పెయిర్ – షేర్" (ఆలోచించు – జతకట్టు – పంచుకో) విధానంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ, థింక్ – పెయిర్–షేర్ విధానంపై ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులలో మౌనంగా, ఇన్‌యాక్టివ్‌గా ఉండే విద్యార్థులను బోధనలో భాగస్వామ్యం చేస్తూ ఉత్తమ బోధన అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ విధానం ద్వారా విద్యార్థులు ప్రశ్నకు వ్యక్తిగతంగా ఆలోచించడం, జతగా చర్చించడం, సమాధానాలను పంచుకోవడం వల్ల విశ్లేషణా, ఆలోచనా, సృజనాత్మక నైపుణ్యాలు పెరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిని బోధనలో భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యా ప్రమాణాలు క్రమంగా మెరుగవుతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

**నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష**

నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. రామగిరి, జూలపల్లి, ధర్మారం మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులు పాల్గొన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. అలాగే నూతన తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణ పనులు వేగవంతం చేసి, డిసెంబర్ చివరి నాటికి భవనాలు ప్రజల వినియోగానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖల పరిధిలో మంజూరైన వివిధ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్లక్ష్యం కనబరిచిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ గిరీష్‌బాబు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల విశ్వాసాలకనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి..

- **ఆలయ బంద్ అనేది అవాస్తవం**
- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణలో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా భీమేశ్వర ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సోమవారం భీమేశ్వర ఆలయంలో తుది దశకు చేరిన ఏర్పాట్లను ఆలయ అధికారులతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజన్న ఆలయం అభివృద్ధి విస్తరణ చేపడుతున్న నేపథ్యంలో భక్తులకు స్వామి వారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయ భక్తుల వసతులపై ప్రత్యేక దృష్టి సారించి రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల దృష్ట్యా 150 కోట్లతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేపడుతున్నామని అన్నారు. ఇప్పటికే వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు పనులు సాగుతున్నాయని అన్నారు. విస్తరణ సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అతి ప్రాచీనమైన అత్యంత విశిష్టత కలిగిన భీమేశ్వర ఆలయంలో భక్తుల దర్శనాలు ఆర్జిత సేవలను ఇప్పటికే ప్రారంభం చేసుకోవడం జరిగిందన్నారు. రాజన్న ఆలయం బంద్ అనేది ఆ వాస్తవమని ప్రతినిత్యం రాజన్నాలయంలో స్వామివారికి నిత్య పూజలు ఏకాంతంగా జరుగుతాయన్నారు. రాజన్న ఆలయంలో పనులు జరిగే క్రమంలో భీమేశ్వరాలయంలో ప్రత్యేకంగా దర్శనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా పనిచేస్తాం అన్నారు. ఇక్కడ ఈవో రమాదేవి ఈఈ రాజేష్ డిఈ రఘునందన్ ఏ ఈ ఓ బ్రాహ్మణ గారి శ్రీనివాస్, ఆలయ ఇన్చార్జి స్థానాచారి నమిలికొండ ఉమేష్ శర్మ తదితరులు ఉన్నారు.

# ఏఐసీసీ అబ్జర్వర్‌కు వినతి పత్రం అందజేసిన కూస రవీందర్



**బలగం, బోయినిపల్లి**

కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణం కోసం ఏఐసీసీ పిలుపుమేరకు సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షునిగా బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో ఎఐసిసి అబ్జర్వర్ శ్రీనివాస్ విమన్నేకి మంగళవారం రోజున గంగాధర మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోస రవీందర్ మాట్లాడుతూ: నేను గత 20 సంవత్సరాలుగా రాజకీయంలో ఉన్నాననీ,1996 నుండి 2001 వరకు కొదురుపాక పిఎసిసి డైరెక్టర్ గా పనిచేశానని, 2006 నుండి 2011 వరకు నా శ్రీమతి కూస పద్మ కొదురుపాక ఎంపీటీసీగా ఉన్నారని, 2013 నుండి 2018 వరకు నేను సర్పంచ్ గా చేశానని, 2014 నుండి 2018 వరకు బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా, 2018 నుండి 2022 వరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీగా, 2022 నుండి ప్రస్తుతం గా కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులుగా పనిచేస్తున్నాన%అఱ% పేర్కొన్నారు. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లాలో మధ్య మానేరు జలాశయం నిర్వాసితుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసానాని, వంటావార్పుతో పాటు ఆమరణ నిరాహార దీక్ష కూడా చేశామని అన్నారు. నీలోజిపల్లి నుండి రాజన్న సిరిసిల్ల వరకు పదివేల మందితో పాదయాత్ర చేశామని, నిర్వాసితుల సమస్యలపై ఎన్నో ఉద్యమాలు చేశామన్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరడం జరిగిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# వెస్టిండీస్‌పై సిరీస్ క్లీన్ స్వీప్

- రెండో టెస్టులో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం
- అర్ధ సెంచరీతో రాణించిన రాహుల్



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 2–0తో క్లీన్ స్వీప్ చేసింది. ఈ విజయంతో భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక బహుమతిగా నిలిచింది.

121 పరుగుల విజయలక్ష్యంతో ఆఖరి రోజు ఆటను 63/1 ఓవర్‌నైట్ స్కోర్‌తో ప్రారంభించిన భారత్, 35.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసి లక్ష్యాన్ని సాధించింది. ఈ విజయంలో కేఎల్ రాహుల్ అద్భుతంగా రాణించాడు. ఆయన 108 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 58 నాటౌట్‌గా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. సాయి సుదర్శన్ (76 బంతుల్లో 39 పరుగులు, 5 ఫోర్లు) హాఫ్ సెంచరీ దిశగా సాగుతుండగా రోస్టన్ ఛేజ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. శుభ్‌మన్ గిల్ (13) కూడా త్వరగానే మైదానాన్ని వీడాడు. చివర్లో ధ్రువ్ జురెల్ (6 నాటౌట్) రాహుల్‌కు అండగా నిలిచి విజయాన్ని పూర్తి చేశాడు.

వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్ రెండు వికెట్లు తీయగా, జోమెల్ వారికన్‌కు ఒక వికెట్ దక్కింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 518/5 భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. రోహిత్ శర్మ సారథ్యంలో భారత బ్యాటర్లు ఆతిథ్య బౌలర్లను చిత్తుగా చిత్తు చేశారు. వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకు ఆలౌట్ కావడంతో భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది.

ఫాలో ఆన్ ఆడిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌటైంది. జాన్ కాంప్‌బెల్ (199 బంతుల్లో 115), షై హోప్ (214 బంతుల్లో 103) సెంచరీలతో ఆకట్టుకోగా, జస్టిన్ గ్రీవ్స్ (50 నాటౌట్) అజేయ అర్ధశతకం సాధించాడు. చివరి వికెట్ కోసం జస్టిన్ గ్రీవ్స్, జైడెన్ సీల్స్ (32)తో కలిసి 79 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

భారత్ బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా (3/44), కుల్దీప్ యాదవ్ (3/104) చెరో మూడు వికెట్లు తీసి విండీస్‌ను ఒత్తిడికి గురి చేశారు. మహమ్మద్ సిరాజ్ (2/43), రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ చెరో వికెట్ దక్కించుకున్నారు. మొత్తం మ్యాచ్‌లో ప్రతి విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచిన టీమిండియా, సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది.

# కెప్టెన్సీని గౌరవంగా భావిస్తున్నా

- భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

వెస్టిండీస్‌పై రెండో టెస్టుతో సిరీస్ ముగిసిన అనంతరం భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మీడియాతో మాట్లాడారు. కెప్టెన్సీని గౌరవంగా భావిస్తున్నానని, అయితే ఆ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించే విధానాన్ని క్రమంగా అలవర్చుకుంటున్నానని తెలిపారు. ఆటగాళ్లను ఎలా నిర్వహించాలో, వారి ఆటతీరు ఎలా మెరుగుపరచాలో కూడా నేర్చుకుంటున్నానని చెప్పారు. గిల్ మాట్లాడుతూ, "మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా సరిగ్గా నిర్ణయాలు తీసుకోవడం చాలా కీలకం. రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో మేము 300 పరుగుల ఆధిక్యంలో ఉన్నాము. పిచ్ చాలా నిర్జీవంగా మారింది. అందుకే ఫాలో ఆన్ ఆడించాలనే నిర్ణయం తీసుకున్నాం," అని వివరించాడు. అలాగే స్పీడ్ బౌలింగ్ చేయగల ఆల్‌రౌండర్లు విదేశీ పిచ్‌లపై జట్టుకు ఎంతో అవసరమని, అందుకే నితీశ్ కుమార్ రెడ్డికి అవకాశం కల్పించినట్లు గిల్ వెల్లడించాడు. "బ్యాటింగ్ చేస్తున్నప్పుడు నేను బ్యాటర్‌గా మాత్రమే ఆలోచిస్తాను, కెప్టెన్‌గా కాదు. చిన్నతనం నుంచే జట్టును గెలిపించాలనే తత్వం నేర్చుకున్నాను," అని గిల్ చెప్పాడు.వెస్టిండీస్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను భారత్ 2–0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. మ్యాచ్ అనంతరం బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా చేతుల మీదుగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ విజేతల ట్రోఫీని అందుకున్నారు.

ఈ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డు లభించింది. ఒక టెస్టులో సెంచరీ చేసిన జడేజా, రెండు మ్యాచ్‌లలో కలిపి మొత్తం ఎనిమిది వికెట్లు తీశాడు. అహ్మదాబాద్ టెస్టులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కూడా గెలుచుకున్నాడు. జడేజా మాట్లాడుతూ, "ఆరో స్థానంలో బ్యాటింగ్ చేయడం నాకు సంతోషంగా ఉంది. కోచ్ గౌతమ్ గంభీర్ నాకు విశ్వాసం చూపి అవకాశం ఇచ్చారు. ఆ బాధ్యతను నెరవేర్చడం ఆనందంగా ఉంది," అని పేర్కొన్నాడు.

# 'బైసన్' ట్రైలర్ రిలీజ్




**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళ స్టార్ హీరో చీయాన్ విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ హీరోగా, సంచలన దర్శకుడు మారి సెల్వరాజ్ (కర్ణన్, మామన్నన్ ఫేమ్) దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'బైసన్' ఈ దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం అక్టోబర్ 17న తమిళంతో పాటు తెలుగు భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ చూస్తుంటే ఈ సినిమా కబడ్డీ ఆట నేపథ్యంతో, గ్రామీణ జీవన శైలిని ప్రతిబింబిస్తూ, ఆడవారిపై సామాజిక వివక్ష, అణగారిన వర్గాల పోరాటం, తిరుగుబాటు వంటి అంశాలను దర్శకుడు మారి సెల్వరాజ్ తనదైన రియలిస్టిక్ టచ్‌తో చూపించబోతున్నట్లు తెలుస్తోంది.

ధ్రువ్ విక్రమ్ ఈ సినిమాలో ఒక కబడ్డీ ఆటగాడిగా కనిపించనున్నాడు. అతని శారీరక భాష, రగిలే యాక్టింగ్ ట్రైలర్‌లోనే ప్రేక్షకుల మనసును దోచుకుంటుంది. మరోవైపు అందాల నటి అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తోంది.పశుపతి, రజిషా విజయన్, అమీర్, లాల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో మట్టి వాసనతో కూడిన ఈ కథకు మ్యూజిక్, విజువల్స్, నేచురల్ టోన్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రైలర్ ద్వారా ఇప్పటికే సినిమా చుట్టూ భారీ హైప్ ఏర్పడింది. మారి సెల్వరాజ్ చిత్రాలకు ఉండే ఆత్మ, భావోద్వేగం, సామాజిక సందేశం ౦ ఇవన్నీ 'బైసన్'లో కూడా కనపడతాయని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీపావళి సందర్భంగా థియేటర్లలో ఈ సినిమా ఎలాంటి సంచలనాన్ని సృష్టిస్తుందో చూడాలి.

## కిస్ సీన్లు లేకపోయినా భావోద్వేగ సాన్నిహిత్యమే ఫీలింగ్ : సిద్ధు జొన్నలగడ్డ

**బలగం టీవీ, హైదరాబాద్**

యువ హీరో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'తెలుసు కదా'. ఈ చిత్రం అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "తెలుసు కదా సినిమాలో ఎలాంటి కిస్ సీన్లు లేవు. నీరజ కోన గారు నాకు స్క్రిప్ట్ వినిపించినప్పుడు, ఈ సినిమాలో ముద్దు సన్నివేశాలు అవసరం లేదని నేను చెప్పాను. మనం భావోద్వేగ సాన్నిహిత్యాన్ని చూపాలి, శారీరక సాన్నిహిత్యాన్ని కాదు" అని తెలిపారు.




# 'మీసాల పిల్ల' సాంగ్ సెన్సేషన్

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి హీరోగా, లేడీ సూపర్‌స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న అత్యంత చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ శరవేగంగా సాగుతోంది.ఇటీవల దసరా సందర్భంగా విడుదలైన ఫస్ట్ సింగిల్ ప్రోమో 'మీసాల పిల్ల' మెగా అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. చిరంజీవి గ్రేస్, ఎనర్జీతో చేసిన డాన్స్ స్టెప్పులు, భీమ్స్ సిసిరీలియో అందించిన ఎనర్జిటిక్ బీట్ ప్రేక్షకులను ఉత్సాహంలో ముంచేశాయి. ఆ ప్రోమోకు వచ్చిన అద్భుత స్పందనతో ఇప్పుడు ఫుల్ లిరికల్ వీడియోను విడుదల చేశారు. ఫుల్ సాంగ్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లిరిక్స్ చాలా క్యాచీగా ఉండగా, మెలోడీతో పాటు మాస్ బీట్ కలయిక అభిమానులను మంత్ర ముగ్ధుల్ని చేస్తోంది. ఈ పాటకు మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది ఉదిత్ నారాయణ వాయిస్. భీమ్స్ సిసిరీలియో సంగీతం, అనిల్ రావిపూడి మాస్ ట్రీట్మెంట్, చిరంజీవి ఎనర్జీ కలయికతో ఈ పాట సంక్రాంతి సెన్సేషన్ అవుతుందనే అంచనాలు పెరుగుతున్నాయి.

## ప్రభాస్ కొత్త సినిమా టైటిల్ లీక్?

**బలగం టీవీ, హైదరాబాద్**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న కొత్త సినిమా టైటిల్‌పై నెలలుగా అభిమానుల్లో నెలకొన్న ఉత్కంఠకు ఇక తెరపడినట్లే కనిపిస్తోంది. 'సీతా రామం' ఫేమ్ దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి 'ఫౌజీ' అనే పేరును ఖరారు చేసినట్లు సమాచారం. అధికారిక ప్రకటన రాకముందే, నటుడు ప్రదీప్ రంగనాథన్ ఓ ఈవెంట్‌లో పొరపాటున ఈ విషయాన్ని బయటపెట్టడంతో ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రదీప్ రంగనాథన్ తన కొత్త సినిమా 'డూడ్' ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సినిమాను కూడా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ సందర్భంగా నిర్మాతల అభిరుచి గురించి మాట్లాడుతూ, "నేను ఇది చెప్పొచ్చో లేదో తెలియదు కానీ, వారు నాకు ప్రభాస్ సర్ నటిస్తున్న 'ఫౌజీ' సినిమా క్లిప్పింగ్స్ చూపించారు. అవి అద్భుతంగా ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. తాను టైటిల్ చెప్పేశానని గ్రహించిన ప్రదీప్ వెంటనే నవ్వుతూ మాట మార్చినా, అప్పటికే ఆ క్లిప్ వైరల్ అయ్యింది. దీంతో ప్రభాస్ సినిమాకు 'ఫౌజీ' అనే పేరే ఖరారైందని సినీ వర్గాలు ఊహిస్తున్నాయి. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. కథ స్వాతంత్ర్యానికి ముందు కాలం నాటిదిగా, పీరియాడికల్ యాక్షన్ డ్రామా శైలిలో సాగనుందని సమాచారం. ఇందులో ప్రభాస్ ఒక శక్తివంతమైన సైనికుడి పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది.



# షిర్డీ సాయిబాబాను దర్శించుకున్న ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్న

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'థామా .' ఈ ఏడాది దీపావళి కానుకగా అక్టోబర్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రస్తుతం సినిమా బృందం చిత్ర ప్రమోషన్లలో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలో చిత్ర హీరో, హీరోయిన్‌లు ఆయుష్మాన్ ఖురానా మరియు రష్మిక మందన్న మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. మంగళవారం మధ్యాహ్నం షిర్డీకి చేరుకున్న వీరిద్దరూ సాయిబాబా సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, బాబా ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్శన సందర్భంగా రష్మిక మందన్న లేత గులాబీ రంగు సాంప్రదాయ దుస్తుల్లో మెరిసి అందరినీ ఆకట్టుకుంది. ఆయుష్మాన్ ఖురానా పసుపు రంగు కుర్తా, తెల్లటి పైజామాలో దర్శనమిచ్చాడు. ఆలయ ప్రాంగణంలో అభిమానులు వీరిని చూసేందుకు భారీగా తరలి వచ్చారు. దర్శనం అనంతరం తమ అనుభవాలను పంచుకున్న ఆయుష్మాన్ ఖురానా మాట్లాడుతూ, "17 ఏళ్ల తర్వాత షిర్డీకి రావడం నాకు ఎంతో ఆత్మసంతృప్తిని ఇచ్చింది. ఈసారి సినిమా విజయం కోసం బాబా ఆశీస్సులు కోరుకున్నాను" అని అన్నారు. రష్మిక మందన్న కూడా రెండోసారి సాయిబాబా దర్శనం చేసుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. 'థామా' చిత్రం ఒక రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాతలు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా, ట్రైలర్ ఇప్పటికే మంచి స్పందనను సొంతం చేసుకుంది. ఇక షిర్డీ దర్శనం ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.